## 150 స్థానాల్లో మహిళా అభ్యర్థులే లేరు!

న్యూఢిల్లీ, మే 30: ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 150 స్థానాల్లో ఒక్క మహిళా అభ్యర్థి కూడా పోటీలో లేరని తాజా నివేదిక వెల్లడించింది. అంటే 27.6 శాతం స్థానాల్లో నారీమణులు బరిలో లేరని ఢిల్లీకి చెందిన టీక్యూహెచ్ పేర్కొన్నది. మహిళా అభ్యర్థుల్లో 14.4 శాతం మందిని ప్రాంతీయ పార్టీలు నామినేట్ చేశాయని, జాతీయ పార్టీలు టికెట్ ఇచ్చిన మహిళా అభ్యర్థుల సంఖ్య 11.8 శాతంగా మాత్రమే ఉన్నదని తెలిపింది. స్వతంత్ర అభ్యర్థుల్లో 7.1 శాతం మంది మాత్రమే మహిళలు అని నివేదించింది.

### వివిధ రాష్ట్రాల్లో మహిళా అభ్యర్థులు

ఒడిశా- 15.4%, పశ్చిమబెంగాల్- 13.8%, ఛత్తీస్‌గఢ్- 13.2%

- మహిళా అభ్యర్థులే లేని రాష్ట్రాలు- మణిపూర్, నాగాలాండ్
- మహిళా అభ్యర్థులు ఎక్కువ ఎక్కడ?

వరంగల్(తెలంగాణ), బారామతి(మహారాష్ట్ర)- 8
కరూర్(తమిళనాడు), కోల్‌కతా(పశ్చిమ బెంగాల్)-7

# మోదీ వర్సెస్ గడ్కరీ

- బీజేపీ అగ్ర నేతల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం?!
- గడ్కరీని ఓడించేందుకు మోదీ-షా పావులు
- ప్రతిగా వారికే చెక్ పెట్టడానికి గడ్కరీ వ్యూహం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతున్నదా? బీజేపీలో అన్నీ తామే అని ఇప్పటివరకూ చెప్పుకొంటున్న 'మోదీ-షా' ద్వయానికి గడ్కరీ త్వరలో చెక్ పెట్టబోతున్నారా? బీజేపీలో గత కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాలు, జాతీయ-అంతర్జాతీయ పత్రికల్లో వస్తున్న విశ్లేషణలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి.

**సంజయ్ రౌత్ వ్యాఖ్యలతో మళ్లీ తెరమీదకు**

మోదీ-షా ద్వయానికి గడ్కరీ వర్గానికి మధ్య గడిచిన కొన్నేండ్లుగా విభేదాలు కొనసాగుతున్నాయన్నది బహిరంగ రహస్యమే. అయితే, నాగ్‌పూర్‌లో గడ్కరీని ఓడించడానికి మోదీ, షా, ఫడ్నవీస్ కలిసి పనిచేశారంటూ శివసేన (ఉద్ధవ్ వర్గం) నేత సంజయ్ రౌత్ ఇటీవల వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. దీన్ని బలపరుస్తూ గడ్కరీకి అనుకూలవర్గంగా చెప్పుకొనే 1.5 లక్షల మంది నాగ్‌పూర్ ఓటర్ల పేర్లు జాబితాలో కనిపించలేదని వార్తలు వచ్చాయి. ఎన్నికల సమయంలో గడ్కరీకి సపోర్ట్‌గా మోదీ, షా ఎలాంటి ప్రచారం చేయలేదు. బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో గడ్కరీ పేరును కూడా మోదీ తొలగించారు. దీంతో ఇవన్నీ విశ్లేషించుకొన్న గడ్కరీ.. తనను ఓడించడానికి ప్రయత్నించిన మోదీతో ప్రత్యక్ష యుద్ధానికి సిద్ధమైనట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. అయితే, ఈ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో విశ్లేషించుకొన్న



తర్వాత గడ్కరీ వర్గం తదుపరి కార్యాచరణకు దిగే అవకాశమున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. దీని కోసం తనకు ఎప్పుడూ అండగా ఉండే ఆరెస్సెస్ కీలక నేతలను గడ్కరీ సంప్రదిస్తున్నట్టు పేర్కొంటున్నారు.

**అసంతృప్తి ఇప్పటిది కాదు..**

బీజేపీలో మోదీ-షా పెత్తనంపై ఆ పార్టీ అగ్ర నేతలకు ఎప్పటినుంచో అసంతృప్తి ఉన్నది. అయితే, గడ్కరీ మాత్రమే ఎప్పటికప్పుడూ మోదీ-షా వ్యవహారశైలిని ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో ఎండగడుతూ వస్తున్నారు. మౌలిక సదుపాయాల్లో అద్భుతాలు చేయవచ్చని, కేంద్రసర్కారు సకాలంలో స్పందించకపోవడంతో ఇది కుదరట్లేదని 2022లో సొంత సర్కారుపైనే గడ్కరీ విరుచుకుపడ్డారు. వాజ్‌పేయీ, అద్వానీ, దీన్‌దయాళ్ కృషి వల్లే నేడు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారం కోసమే రాజకీయాలు చేస్తున్నారని, వాడుకొని వదిలేయడమే ప్రధానమయ్యిందని వాపోయారు. దీంతో 2022లో బీజేపీ పార్లమెంటరీ బోర్డు నుంచి మోదీ.. గడ్కరీకి ఉద్వాసన పలికారు. పార్టీ ప్రచార కార్యక్రమాల్లో ఆయనకు ప్రాధాన్యం తగ్గించారు.

**ఎన్నికల తర్వాత తిరుగుబావుటా!**

కేంద్ర జాతీయ రహదారుల మంత్రిగా ఉన్న గడ్కరీ హయాంలో హైవేలు కొంతమేర బాగుపడ్డాయని కొన్ని పత్రికలు వార్తలు రాశాయి. అయితే, ఈ క్రెడిట్‌ను గడ్కరీకి దక్కకుండా చేసిన మోదీ.. ఇది తమ ప్రభుత్వ ఘనతగా చెప్పుకొన్నారు. ఇదేసమయంలో సరిగ్గా ఎన్నికల ముందే ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవేలో అవసరం లేకపోయినా ఎక్కువ నిధులు ఖర్చు చేశారంటూ కాగ్ నివేదిక ఇచ్చింది. గడ్కరీని ఇరుకున పెట్టేందుకే మోదీ ఇలా చేశారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇక, తన స్వరాష్ట్రం మహారాష్ట్రకు రావాల్సిన ఫాక్స్‌కాన్, ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ వంటి పెద్ద కంపెనీలను గుజరాత్‌కు మోదీ తరలించుకుపోవడం అసహనాన్ని పెంచినట్టు చెబుతారు. వెరసి.. మోదీ-షా ద్వయంపై గడ్కరీ వర్గం ఎన్నికల తర్వాత తిరుగుబావుటా ఎగురవేయవచ్చన్న వార్తలు వస్తున్నాయి. అయితే, గడ్కరీ తిరుగుబాటు చేస్తే ఆయనకు కూడా ప్రమాదమేనని చెప్పున్నారు. గడ్కరీ కుమారుడు ప్రధాన నిందితుడిగా ఉన్న 2009నాటి 'గడ్కరీ కుమారుడి కారులో ఏడేండ్ల బాలిక మృతదేహం' కేసును ఇప్పుడు కేంద్రం మళ్లీ తెరమీదకు తీసుకురావచ్చని, గడ్కరీని ఇరుకున పెట్టొచ్చని అంటున్నారు. కాగా, 'మోదీ తర్వాత పీఎంగా ఎవరు?' అన్న ప్రశ్నకు సమాధానంగా 'ది ఎకానమిస్ట్' ఇటీవల రాసిన ఓ కథనంలో పేర్కొన్న ముగ్గురు వ్యక్తుల్లో గడ్కరీ కూడా ఉండటం కొసమెరుపు.

## యూపీలో బీజేపీకి ఎదురుగాలి!

### ఫలోడీ సత్తా బజార్ అంచనా

*లక్నో, మే 30: కేంద్రంలో బీజేపీ రెండుసార్లు అధికారంలోకి రావడానికి కారణమైన ఉత్తరప్రదేశ్‌లో ఈసారి ఆ పార్టీకి ఎదురుగాలి వీస్తున్నదా ? యూపీలో ఆ పార్టీ గెలుచుకునే సీట్ల సంఖ్య తగ్గిపోనున్నదా ? అంటే అవుననే అంటున్నది రాజస్థాన్‌లోని ఫలోడీ సత్తా బజార్. సత్తా బజార్ అంటే ఒక బెట్టింగ్ మార్కెట్. ఉత్తరప్రదేశ్‌లో ఈసారి బీజేపీ సాధించబోయే సీట్ల సంఖ్య తగ్గుతుందని ఫలోడీ సత్తా బజార్ అంచనా వేస్తున్నది. 80 సీట్లున్న యూపీలో బీజేపీకి 2014లో 71, 2019లో 62 స్థానాలు దక్కాయి. ఈసారి మాత్రం 55 నుంచి 65 మధ్య రావొచ్చని ఫలోడీ సత్తా బజార్ లెక్కలు చెప్తున్నాయి.*

## గాంధీపై వ్యాఖ్యలు.. మోదీపై పోలీసులకు ఫిర్యాదు

*గువాహటి, మే 30: జాతిపిత మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ప్రధాని నరేంద్ర మోదీపై జాతీయ అవార్డు గ్రహీత, సినీ నిర్మాత ల్యూట్ కుమార్ బర్మన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహాత్ముడిని అవమానపరిచేలా మోదీ వ్యాఖ్యలు చేసినందున ఆయనపై కేసు నమోదు చేయాలంటూ గువాహటిలోని హటిగావ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు అందజేశారు. అయితే దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, ప్రాథమిక దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మహాత్ముడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన వ్యక్తని, అయితే ఆయన జీవితాన్ని ఆధారంగా చేసుకుని తీసిన గాంధీ చిత్రం విడుదలయ్యే వరకు ఆయన గురించి ప్రపంచానికి పెద్దగా తెలియదంటూ మోదీ ఒక టీవీ ఇంటర్వ్యూలో పేర్కొన్నారని చెప్పారు.*

## తుది అంకానికి లోక్‌సభ పోరు

- ముగిసిన ప్రచార పర్వం
- రేపు చివరి విడత ఎన్నికలు
- 57 స్థానాలకు పోలింగ్
- జూన్ 4న ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ, మే 30: లోక్‌సభ ఎన్నికల సంగ్రామం తుది అంకానికి చేరుకుంది. ఎన్నికల ప్రచార పర్వానికి గురువారంతో తెరపడింది. మూడు నెలలుగా ప్రచారంలో తీరిక లేకుండా గడిపిన నేతలకు విశ్రాంతి లభించింది. హోరెత్తిన మైకులు మూగబోయాయి. జూన్ 1న జరగనున్న ఏడో, చివరి విడత ఎన్నికలకు గురువారం సాయంత్రంతో ప్రచార గడువు పూర్తయ్యింది. ఇవి చివరి విడత ఎన్నికలు కావడంతో మొత్తం ఈ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. చివరి విడతలో భాగంగా 8 రాష్ట్రాల్లోని 57 స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. పంజాబ్‌లో 13 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్‌లో నాలుగు, ఉత్తరప్రదేశ్‌లో 13, పశ్చిమ బెంగాల్‌లో తొమ్మిది, బీహార్‌లో ఎనిమిది, ఒడిశాలో ఆరు, జార్ఖండ్‌లో మూడు సీట్లతో పాటు చండీగఢ్ స్థానానికి పోలింగ్ జరగనుంది. కాగా, ఇప్పటివరకు 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 486 స్థానాలకు పోలింగ్ ముగిసింది.

**కన్యాకుమారిలో మోదీ ధ్యానం**

లోక్‌సభ ఆఖరి విడత ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రంతో ముగియడంతో ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడులోని కన్యాకుమారికి చేరుకున్నారు. ఇక్కడి వివేకానంద రాక్ మెమోరియల్‌లో 45 గంటల సుదీర్ఘ ధ్యానాన్ని ప్రారంభించారు. మోదీ పర్యటన సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం నుంచి జూన్ 1 సాయంత్రం వరకు ఆయన అక్కడే ధ్యానంలో గడుపుతారు.

**నల్లజెండాలతో నిరసన**

మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ మధురైలో తంతై పెరియార్ ద్రవిడర్ ఖజగం పార్టీ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. అలాగే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సైతం గో బ్యాక్ మోదీ హ్యాష్‌టాగ్‌తో పోస్టులు వెల్లువెత్తాయి. జూన్ 1న ఆఖరి విడత ఎన్నికలు జరగనుండగా, మోదీ ధ్యాన కార్యక్రమాన్ని ప్రసారం చేస్తుండటం పట్ల విపక్ష పార్టీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కాగా, ఇది మోదీ వ్యక్తిగత పర్యటన అని, ఇందులో పార్టీ వర్గాలు పాలుపంచుకోవని తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు.

## మాకు వ్యతిరేకంగా 'శత్రు భైరవి యాగం'

### డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు

బెంగళూరు: కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గురువారం సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను, సీఎం సిద్ధరామయ్యను, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్‌గా చేసుకొని కేరళలోని ఓ ఆలయంలో జంతువుల బలితో కూడిన 'శత్రు భైరవి యాగం' నిర్వహిస్తున్నారని ఆరోపించారు. శత్రువుల సంహారం కోసం దీన్ని చేస్తున్నారని, ఈ యాగంలో భాగంగా పలు జంతువులను కూడా బలి ఇచ్చారని అన్నారు. అయితే కర్ణాటకలోని కొందరు రాజకీయ నాయకులు దీన్ని చేయిస్తున్నారని, ఇందుకోసం కొంత మంది అఘోరాలను కూడా సంప్రదించారని చెప్పారు.

## పాండియన్ నా వారసుడు కాదు

### దాన్ని రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారు

### ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్, మే 30: వీకే పాండియన్ తన రాజకీయ వారసుడు కాదని ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. తన వారసుడ్ని రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారని గురువారం ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పేర్కొన్నారు. తన తరపున అన్ని నిర్ణయాలు పాండియనే తీసుకొంటూ షాడో సీఎంగా ఉన్నారన్న ఆరోపణలపై స్పందిస్తూ.. 'ఇది హాస్యాస్పదం. దీనికి ఏమాత్రం ఆధారాలు లేవు' అని అన్నారు. తమిళనాడుకు చెందిన మాజీ బ్యూరోక్రాట్ వీకే పాండియన్ నవీన్ పట్నాయక్‌కు బీజేడీ పార్టీలో, ప్రభుత్వంలో అత్యంత సన్నిహితుడిగా కొనసాగుతున్నారు.

## జూన్ 4 తర్వాత బీహార్‌లో పెనుమార్పు

### బీజేపీతో నితీశ్‌కి పొసగడం లేదు: తేజస్వీ

పాట్నా, మే 30: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్-బీజేపీ బంధంపై ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో నితీశ్‌కు పొసగడం లేదని, ఎన్నికలైన జూన్ 4 తర్వాత రాష్ట్రంలో 'పెనుమార్పు' జరగబోతున్నదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత చాచా (నితీశ్) పెద్ద నిర్ణయం తీసుకోబోతున్నారని రెండ్రోజుల క్రితం తాను చెప్పినప్పటి నుంచీ ఆయన ఎన్నికల ప్రచారానికి కూడా వెళ్లడం లేదని పేర్కొన్నారు. అధికారులతో గవర్నర్ సమావేశాలు నిర్వహించి ఆదేశాలు కూడా జారీచేస్తున్నట్టు తనకు తెలిసిందని తేజస్వీ యాదవ్ తెలిపారు.

## శశిథరూర్ పీఏ గోల్డ్ స్మగ్లింగ్!

### అరకేజీ బంగారంతో చిక్కిన సహాయకుడు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత శశి థరూర్ సహాయకుడు అరకిలో బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ కస్టమ్స్ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. రూ. 35 లక్షల విలువజేసే బంగారు గొలుసును బుధవారం ఇద్దరు నిందితులు తరలిస్తుండగా పట్టుకొన్నామని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోని కస్టమ్స్ అధికారులు తెలిపారు. నిందితుల్లో ఒకరు శశిథరూర్ సహాయకుడు శివ ప్రసాద్‌గా గుర్తించినట్టు వెల్లడించారు.

**దర్యాప్తునకు సహకరిస్తా**

ఈ ఘటనపై థరూర్ గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'విషయం తెలిసి షాక్‌కి గురయ్యా. వయసు 72 ఏండ్లు. డయాలిసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితుల్లో ఉన్నాడని తెలుసుకొని.. గతంలోనే రిటైర్మెంట్ తీసుకొన్నప్పటికీ, పార్ట్‌టైమ్ కింద అతన్ని విధుల్లోకి తీసుకొన్నా. అయితే, ఇలాంటి తప్పులను క్షమించబోను. దర్యాప్తు అధికారులకు అన్ని విధాలుగా సహకరిస్తా. ' అని అన్నారు.

## కెనడాలో భారత విద్యార్థుల నిరాహార దీక్ష

### కొత్త పీఆర్ నిబంధనలపై ఆందోళన

టొరంటో, మే 30: శాశ్వత నివాసానికి(పీఆర్) సంబంధించి కెనడాలోని ప్రిన్స్ ఎడ్వర్డ్ ఐలాండ్(పీఈఐ) ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా భారతీయ విద్యార్థులు నిరసనలను తీవ్రతరం చేస్తున్నారు. 2024లో 2,100 మందికి బదులుగా 1,600 మందికే పీఆర్ ఇవ్వాలని స్థానిక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రొవిన్షియల్ నామినీ ప్రోగ్రామ్(పీఎన్‌పీ) కింద పీఆర్‌కు నామినేట్ అయిన వారిని కూడా తగ్గించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాలు కెనడాలో చదువు పూర్తి చేసుకొని పీఆర్‌పై ఆశలు పెట్టుకున్న భారతీయ విద్యార్థులకు ఇబ్బందికరంగా మారాయి. వీరిలో చాలా మంది వీసా గడువు కూడా ముగుస్తున్నది. వీరు కెనడా వీడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే దాదాపు 50 మంది భారత్‌కు తిరిగొచ్చేశారు.

## 'అగ్నిబాణ్' ప్రయోగం సక్సెస్

### అగ్నికుల్ ఘనత.. మొదటిసారి 3డీ ప్రింటెడ్ ఇంజిన్ వినియోగం

న్యూఢిల్లీ: అంతరిక్ష రంగంలో భారత్ మరో ముందడుగు వేసింది. చెన్నైకు చెందిన స్టార్టప్ సంస్థ అగ్నికుల్ కాస్మోస్.. గురువారం 'అగ్నిబాణ్' రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ సబ్ ఆర్బిటల్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్‌లో ప్రపంచంలోనే మొదటిసారిగా 3డీ ప్రింటెడ్ సెమీ-క్రయోజెనిక్ ఇంజిన్‌ను వినియోగించారు. గురువారం ఉదయం 7.15 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్న ప్రైవేటు లాంచ్‌ప్యాడ్ నుంచి దీన్ని ప్రయోగించారు. ఈ రాకెట్‌ను ఆటోపైలట్ సాఫ్ట్‌వేర్‌తో పూర్తిగా తామే డిజైన్ చేశామని, ఇందులో ప్రపంచంలోనే మొదటిసారిగా సింగిల్ పీస్ 3డీ ప్రింటెడ్ ఇంజిన్‌ను వినియోగించామని ఈ సంస్థ ప్రకటించింది. సెమీ క్రయోజెనిక్ ఇంజిన్ వాడిన మొదటి భారతీయ రాకెట్ ఇదే.

## ఏడేండ్ల ముందే.. క్యాన్సర్ గుర్తింపు!

మొదటిపేజీ తరువాయి...

618 ప్రొటీన్లను గుర్తించారు. వీటిపై మరిన్ని పరిశోధనలు చేస్తున్నారు. ఒకవేళ ఈ పరిశోధన ఫలితాలు ఆశాజనకంగా ఉంటే.. ఏడేండ్ల ముందుగానే క్యాన్సర్‌ను కనిపెట్టవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. క్యాన్సర్‌కు తగిన చికిత్సను ముందస్తుగా తీసుకొని లక్షలాది మంది ప్రాణాలను కాపాడొచ్చని అంటున్నారు.

**ఏమిటీ ప్రొటీన్లు?**

బ్రిటన్‌లోని యూకే బయోబ్యాంక్ నుంచి సుమారు 44 వేల మంది రక్త నమూనాలను సేకరించిన పరిశోధకులు ఆ శాంపిళ్లలో 1,463 ప్రత్యేక ప్రొటీన్లు ఉండటాన్ని గుర్తించారు. ఈ మొత్తం రక్త నమూనాల్లో 4,900 మందికి ఆ తర్వాత క్యాన్సర్ సోకింది. దీంతో క్యాన్సర్ సోకిన వారి రక్త నమూనాల్లో ఉన్న ప్రొటీన్లు, సోకని వారి నమూనాల్లోని ప్రొటీన్లను విశ్లేషించారు. అలా చివరకు పెద్దప్రేగు, ఊపిరితిత్తులు, కాలేయం, శోషరస నాళాలకు సంబంధించిన మొత్తం 19 రకాల క్యాన్సర్లకు 618 ప్రత్యేక ప్రొటీన్లతో సంబంధం ఉన్నట్టు ప్రాథమికంగా ఓ అవగాహనకు వచ్చారు.

**క్యాన్సర్‌కు హెచ్చరికగా..**

తమకు క్యాన్సర్ సోకే ప్రమాదమున్నదో లేదో తెలుసుకోవడానికి సాధారణంగా చాలామంది తరుచూ బ్లడ్ టెస్టులు చేసుకొంటుంటారు. అయితే ఆ రక్త నమూనాల్లో తాము కనుగొన్న 618 ప్రొటీన్లు గుర్తిస్తే ఆ వ్యక్తులకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉండొచ్చని పరిశోధకులు వెల్లడించారు. ఇది హెచ్చరిక మాత్రమేనని, క్యాన్సర్ కచ్చితంగా వస్తుందని తాము చెప్పట్లేదని గుర్తుచేశారు. దీనిపై మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందన్నారు. తమ ప్రయోగం.. క్యాన్సర్‌ను ఏడేండ్ల ముందుగానే గుర్తించడానికి అవకాశాన్ని మాత్రమే కల్పిస్తుందని తెలిపారు.

# కొంపముంచిన 7 దశలు!

- సుదీర్ఘ పోలింగ్ తమకు కలిసొస్తుందనుకొన్న బీజేపీ
- అందుకు తగ్గట్టే.. 400 సీట్లు వస్తాయని తొలుత గప్పాలు
- తొలి దఫా పోలింగ్ నుంచే విరుద్ధంగా మారిన పరిస్థితులు
- సర్వేల రిపోర్టులూ ప్రతికూలమే.. నిస్తేజంగా బీజేపీ క్యాడర్
- ఒత్తిడిలో మోదీ.. ప్రసంగాల్లో విద్వేష వ్యాఖ్యలు అందుకే
- రాజకీయ విశ్లేషకుల అంచనా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

*హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): 'ఈసారి 400కు పైగా సీట్లు సాధించి హ్యాట్రిక్ విజయాన్ని సాధించబోతున్నామం'టూ తొలి దఫా పోలింగ్ కంటే ముందు ధీమాగా చెప్పిన ప్రధాని మోదీ చివరి దఫాకు వచ్చే సరికి తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. పోలింగ్‌కు ముందు ఉన్న ఉత్సాహం.. ఆ తర్వాత మోదీ సహా బీజేపీ నేతల్లో నీరుగారిపోయింది. 543 స్థానాలకు ఏడు విడుతల్లో 43 రోజుల వ్యవధిలో సుదీర్ఘ పోలింగ్ నిర్వహణ తమకు కలిసొస్తుందని భావించిన మోదీ పరివారానికి అది బెడిసికొట్టడం తీవ్ర షాక్‌కు గురిచేసింది. అందుకే మోదీ విసుగ్గా ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.*

**సుదీర్ఘ పోలింగ్‌తో అసలుకే మోసం**

*ఏడు దఫాల్లో నెలన్నర పాటు పోలింగ్ జరిగితే తమకు లాభిస్తుందనుకొన్న బీజేపీ అంచనాలు చివరకు తలకిందులయ్యాయి. ఒక్కో విడుత మధ్య సుమారు వారంపాటు వ్యవధి ఉండటంతో ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలను విపక్షాలు ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లగలిగాయి. దీంతో అధికార పక్షం ఆత్మరక్షణలో పడింది. ఒకవిధంగా బీజేపీ క్రమంగా నీరుగారిపోతే.. విపక్షాలు పుంజుకొన్నాయి. దీంతో 400పైగా సీట్లు వస్తాయంటూ తొలుత ప్రచారం చేసిన బీజేపీకి మెజార్టీ సీట్లు వచ్చే అవకాశాలు కూడా మృగ్యమయ్యాయి. ఇక, విజయావకాశాలపై దెబ్బ పడకూడదని బీజేపీ పెద్దయెత్తున సిట్టింగ్‌లకు టికెట్లను నిరాకరించింది. 130కు పైగా సీట్లలో కొత్తవారినే ఎంపిక చేసింది. సిట్టింగ్‌లపై ఉన్న వ్యతిరేకత.. ఫలితాలపై ప్రభావం చూపించవచ్చన్న కారణంతోనే వీరిని బీజేపీ తప్పించినట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గడిచిన మూడు దశాబ్దాల్లో తొలిసారిగా కశ్మీర్‌లో బీజేపీ పోటీకి దూరంగా ఉండటం గమనార్హం.*



**ప్రసంగాల్లో అసహనం, విద్వేషం**

*ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన ప్రసంగాల్లో అసహనం, విద్వేషం కనిపించడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. 'కాంగ్రెస్ మన తల్లులు, చెల్లెళ్ల మంగళ సూత్రాలను కూడా వదలదు' అని ఒకసారి.. 'దేశ సంపదనంతా చొరబాటుదారులకు, ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి (ముస్లింలకు) కాంగ్రెస్ పంచిపెడుతుం'దని మరోసారి.. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే, వాళ్ల పాలనలో హనుమాన్ చాలీసాను వినడాన్ని కూడా నేరంగా పరిగణిస్తారని ఇంకోసారి మోదీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీజేపీకి సీట్లు తగ్గుతాయన్న ఆందోళనతోనే మోదీ వ్యాఖ్యల్లో అసహనం, విద్వేషం పాళ్లు పెరిగినట్టు రాజకీయ నిపుణులు చెబుతున్నారు. మోదీ విద్వేష వ్యాఖ్యలపై అంతర్జాతీయ మీడియా కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో నష్టనివారణ చర్యలకు దిగిన ప్రధాని.. ముస్లిలంను చొరబాటుదారులంటూ తాను అనలేదని యూటర్న్ తీసుకొన్నారు.*

### నివేదికలతో గుబులు

*ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని అధికారానికి దూరం చేయడం సాధ్యమయ్యే పనేనని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ పేర్కొనడం, బీజేపీకి 200 సీట్లు దాటబోవని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అంచనా వేయడం బీజేపీ నేతల్లో గుబులు పెంచింది. మోదీ మ్యాజిక్ ఈ ఎన్నికల్లో పనిచేసే అవకాశమేలేదని నివేదికలు తేల్చిచెప్పడం ఈ భయాలను రెట్టింపు చేసింది. మార్కెట్లో ప్రకంపనలు ఈ అంచనాలను ధ్రువపర్చాయి. దీంతో ప్రధాని మోదీ తన ప్రసంగాల్లో విద్వేషాన్ని చిమ్మడం ప్రారంభించినట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.*

## జమ్ముకశ్మీర్‌లో పోలీసులు, సైన్యం ఘర్షణ

శ్రీనగర్, మే 30: డ్రగ్ కేసులో ఆర్మీ జవాన్‌ను ప్రశ్నించారన్న ఆగ్రహంతో కొంతమంది ఆర్మీ సిబ్బంది జమ్ముకశ్మీర్‌లోని ఒక పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి బీభత్సం సృష్టించారు. ఈ ఘటన కుప్వారా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. దీంతో ముగ్గురు ఆర్మీ లెఫ్టినెంట్ కర్నల్స్ సహా 13 మంది జవాన్లపై కేసు నమోదు చేశారు. ముగ్గురు సీనియర్ ఆర్మీ అధికారుల ఆధ్వర్యంలో 160 టెరిటోరియల్ ఆర్మీకి చెందిన కొంతమంది సాయుధ జవాన్లు పోలీసుస్టేషన్‌కు వచ్చి అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేశారు. అక్కడ ఉన్న ఒక పోలీసును అపహరించుకుని పోయారు. ఈ దృశ్యాలు వైరల్‌గా మారాయి. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ ఉన్నతాధికారులు ఆర్మీ సిబ్బందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా, ఆర్మీ సిబ్బంది పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారనడంలో వాస్తవం లేదని సైనిక అధికార ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.

## హిందూ-ముస్లిం వివాహం చెల్లదు

### మధ్య ప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు

భోపాల్, మే 30: ముస్లిం పర్సనల్ లా ప్రకారం ముస్లిం అబ్బాయితో హిందూ అమ్మాయి వివాహం చెల్లుబాటు కాదని మధ్య ప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక వివాహ చట్టం కింద తమ వివాహాన్ని రిజిస్ట్రార్ వద్ద నమోదు చేయించుకునేందుకు పోలీసు భద్రత కల్పించాలని ఓ హిందూ అమ్మాయి, ముస్లిం అబ్బాయి కోర్టును ఆశ్రయించారు. పెండ్లి తర్వాత దంపతులిద్దరూ మతం మారబోరని యువతీ యువకుల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ముస్లిం పర్సనల్ లాలో మతాంతర వివాహం నిషేధమే అయినప్పటికీ, ప్రత్యేక వివాహ చట్టం కింద చెల్లుబాటు అవుతుందని కోర్టుకు తెలిపారు. వీరి వాదనలను విన్న జస్టిస్ గుర్పాల్ సింగ్ అహ్లువాలియా.. హిందూ అమ్మాయి ముస్లిం అబ్బాయిని ప్రత్యేక వివాహ చట్టం కింద పెండ్లి చేసుకున్నప్పటికీ పర్సనల్ లా ప్రకారం నిషేధమైన ఈ వివాహం చట్టబద్ధం కాదని స్పష్టం చేశారు.

# 'ఉపాధి'పై కేంద్రం పిడుగు!

- గత రెండేండ్లలో 8 కోట్ల మంది ఉపాధిహామీ కార్మికుల తొలగింపు
- 2022-23లో నమోదిత కార్మికుల్లో 20.47% మంది డిలీట్
- పౌర సంఘాల తాజా నివేదిక వెల్లడి

*న్యూఢిల్లీ, మే 30: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక